క్లుప్తంగా

వైభవంగా స్వామి కల్యాణం



నగరంపాలెం: స్థానిక బ్రాడీపేట 2/7వ అడ్డరోడ్డులోని శ్రీగౌరివిశ్వేశ్వరాలయంలో మంగళవారం స్వామి జన్మ నక్షత్రం సందర్భంగా కల్యాణం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామికి ప్రత్యేక పూజలు, అలంకరణలు చేశారు. అర్చకులు విశ్వేశ్వరశర్మ, పి.వెంకట్, సీతారత్నకుమారి, కుందుర్తి కామేశ్వరరావు, సరస్వతి దంపతులతో కల్యాణ కార్యక్రమాన్ని జరిపించారు. ఆలయ అర్చకులు జంధ్యాల సుబ్రహ్మణ్యశాస్త్రి, పవన్‌కుమార్‌శర్మ, మల్లికార్జునశర్మ, చక్రపాణి, వాసు కార్యక్రమాలను పర్యవేక్షించారు. పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్ద ఎత్తున్న తరలివచ్చి, స్వామి వారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

వట్టికూటి వెంకటసుబ్బయ్యకు ఘన నివాళి

లక్ష్మీపురం: సంఘసేవ నిబ్ధతతో పనిచేసిన మహనీయుడు గుంటూరు గాంధీ వట్టికూటి వెంకట సుబ్బయ్య అని అవగాహన సంస్థ కార్యదర్శి కొండాశివరామిరెడ్డి అన్నారు. లక్ష్మీపురంలోని అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం గుంటూరు గాంధీ సంస్మరణ కార్యక్రమం నిర్వహించారు. తొలుత ఆయన విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీనియర్ సిటిజన్ సర్వీస్ ఆర్గనైజేషన్ నాయకులు దాసరి హనుమంతరావు, సుబ్బారావు, శేషగిరిరావు, సంస్థ సభ్యులు అత్తోట సుబ్బారావు, జక్రయ్య పాల్గొన్నారు.

కురియన్ జీవితంపై పవర్ పాయింట్ ప్రజంటేషన్

నగరంపాలెం: స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయ ప్రాంగణం అన్నమయ్య కళావేదికపై మంగళవారం సాయంత్రం డాక్టర్ వర్గీస్ కురియన్ జీవితంపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ నిర్వహించారు. జిల్లా సీనియర్ సిటిజన్స్ సర్వీస్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో జరగ్గా, సంస్థ అధ్యక్షులు ఆచార్య మన్నె సుబ్బారావు, ఆలయ ఉపాధ్యక్షులు లంకా విజయబాబు జ్యోతిప్రజ్వలనతో ప్రారంభించారు. ఈ సందర్భంగా మన్నె సుబ్బారావు మాట్లాడుతూ డాక్టర్ వర్గీస్ కురియన్ పాల ఉత్పత్తిలో అమూల్ సంస్థ ద్వారా ఆపరేషన్ ఫ్లడ్ అనే సిబాక్‌ను దేశాన్ని అత్యున్నత స్థానంలో నిలిపారని అన్నారు. అందరూ శుద్ధమైన పాలను సేవిస్తున్నామంటే ఆయన గొప్పతనమేనని పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా ఆయన వివరించారు.

క్విజ్ పోటీల విజేతలకు బహుమతులు



గుంటూరు ఎడ్యుకేషన్: రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా జేకేసీ కళాశాలలో విస్తృతి కార్యాచరణ సమితి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూత్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్విజ్ పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులు జిల్లా అధికార యంత్రాంగం నుంచి బహుమతులు అందుకున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ పి.గోపీచంద్ తెలిపారు మంగళవారం కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ 150 మంది విద్యార్థులు పాల్గొన్న పోటీల్లో బీసీఏ విద్యార్థిని జె.మహిత, బీకాం విద్యార్థిని జె.లక్ష్మి, ఆర్.జెస్సిక వరుసగా తొలి మూడుస్థానాల్లో బహుమతులు సాధించగా, ఎండీ నగీనాబేగ్, వి.ప్రవీణ్‌కుమార్ కన్సొలేషన్ బహుమతులు పొందినట్లు వివరించారు. సోమవారం పోలీస్ పరేడ్‌గ్రౌండ్స్‌లో నిర్వహించిన మహిళా మీకోసం కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఎస్. నాగలక్ష్మి సమక్షంలో నగర కమిషనర్ పులి శ్రీనివాసులు విద్యార్థులకు జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు బహూకరించినట్లు తెలిపారు. కార్యక్రమంలో విస్తృతి కార్యాచరణ సమితి ఉపాధ్యక్షురాలు పి.నాగసుశీల, బీఆర్ అంబేడ్కర్ యూత్ ఆర్గనైజేషన్ అధ్యక్షుడు సముద్రాల చిన కోటేశ్వరరావు, కర్రా హానోకు బెంజిమెన్, కళాశాల పీజీ కోర్సుల డైరెక్టర్ ఎస్ఆర్కే ప్రసాద్ పాల్గొన్నారు.

వృద్ధుడి అనుమానాస్పద మృతి

లక్ష్మీపురం: నైట్ వాచ్ మెన్‌గా పని చేస్తున్న వృద్ధుడు తోపుడు బండిపై నిద్రిస్తూ కింద పడి మృతి చెందిన ఘటన కాకాని రోడ్డులో చోటుచేసుకుంది. పాత గుంటూరు పోలీసులు తెలిపిన వివరాలు.. మంగళదాస్ నగర్ 2వ లైన్‌కు చెందిన లింగాల తిరపతయ్య(62) కాకాని రోడ్డులో వాచ్ మెన్‌గా పని చేస్తూ తోపుడు బండిపై నిద్రించాడు. రాత్రి సమయంలో తోపుడు బండి పై నుంచి కింద పడి మృతి చెందాడు. మంగళవారం ఉదయం స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతుడి కుమారుడు ప్రసాద్ ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు.

బస్టాండ్‌లో..

ఆర్‌టీసీ బస్టాండ్‌లో ఓ వృద్ధుడు మృతి చెందిన ఘటన మంగళవారం చోటుచేసుకుంది. వివరాలు.. శ్రీకాకుళం జిల్లాకు చెందిన ఓ వృద్ధుడు గుంటూరు ఆర్‌టీసీ బస్టాండ్‌లోని తెనాలి బస్ స్టాప్‌లో కూర్చుని ఉన్నాడు. ఒక్కసారిగా కుప్పకూలి కిందపడి పోయాడు. గమనించిన తోటి ప్రయాణికులు పోలీసులకు సమాచారం ఇచ్చి, ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడి జేబులో ఉన్న సెల్‌ఫోన్ ద్వారా మృతుడి కుమారుడికి ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చారు.

చిట్టడవిని తలపిస్తున్న ఖాళీ స్థలాలు

- దోమలు, విష సర్పాలకు ఆవాసాలుగా మారిన వైనం
- మలేరియా, డెంగీ వ్యాధులు విజృంభిస్తాయనే భయం
- పట్టించుకోని జీఎంసీ అధికారులు, స్థల యజమానులు

కొరిటెపాడు(గుంటూరు): నగరంలో ఖాళీస్థలాలు చిట్టడవిని తలపిస్తున్నాయి. స్థలాల్లో కొందరు నిర్మాణాలు చేపట్టడం లేదు. దీంతో చెట్లు పెరిపోతున్నాయి. లోతట్టు ప్రాంతాల్లో మురుగునీరు చేరి దుర్గంధం వెదజల్లుతోంది. పట్టించుకోవాల్సిన అధికారులు స్పందించడం లేదు. దీంతో పరిసర ప్రాంత ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

వివిధ డివిజన్లలో..

గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో వివిధ డివిజన్లలోని పలు ప్రాంతాల్లో నివాసాల మధ్య ఉన్న ఖాళీ స్థలాలు ప్రమాదకరంగా మారాయి. తక్కువ రేట్లు ఉన్నప్పుడు కొందరు వ్యక్తులు ఖాళీ స్థలాలను కొని ధరలు పెరిగినప్పుడు అమ్ముకుందామని వదిలివేసిన స్థలాలు ఏళ్ల తరబడి అలానే ఉండిపోయాయి. దీంతో ఆయా ఖాళీ స్థలాల్లో పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగిపోయి చిట్టడవులను తలపిస్తున్నాయి. అదే విధంగా



ముత్యాలరెడ్డి నగర్ 4వ లైనులో ఖాళీ స్థలంలో ఇలా...

డ్రెయినేజీ వ్యవస్థ లేని కారణంగా వర్షపు నీరు నిలిచి మురుగు తటాకాలుగా మారాయి. స్థలం ఖాళీగా ఉండటంతో చుట్ట పక్కల నివసించేవారు పడేసే చెత్తాచెదారం, వ్యర్థాలతో దుర్వాసన వెదజల్లుతోంది. ముఖ్యంగా ఖాళీ స్థలాలు ఎంత అధ్వానంగా ఉన్నప్పటికీ అసాంఘిక శక్తులు అక్కడికి చేరి స్థానికంగా నివసిస్తున్న వారికి నిద్ర లేకుండా భయభ్రాంతులకు గురి చేయడం పరిపాటిగా మారింది.

ఇళ్లలోకి వస్తున్న విష సర్పాలు..



బాలాజీ నగర్ 4వ లైను(రెడ్డిపాలెం)లో ఖాళీ స్థలంలో మురుగు నీరు చేరి తటాకాన్ని తలపిస్తున్న దృశ్యం

ఖాళీ స్థలాల్లో మురుగు నిల్వ ఉండటంతో దోమలు, విషసర్పాలకు ఆవాసాలుగా మారుతున్నాయి. పగలు, రాత్రి అన్న తేడా లేకుండా దోమలు విజృంభిస్తూ నివాసితులకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా వాటి ధాటికి తట్టుకోలేక పోతున్నామని, లేనిపోని రోగాలను కొని తెచ్చుకునే దుస్థితి దాపురించిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మురుగు తటాకాల్లా మారిన ఖాళీ స్థలాల్లో పందులు స్వైరవిహారం చేస్తున్నాయని, అలాగే ఏపుగా పెరిగిన పిచ్చి మొక్కల కారణంగా విషసర్పాలు చేరి రాత్రి సమయాల్లో ఇళ్లలోకి వచ్చేస్తున్నాయని స్థానికులు వాపోతున్నారు.

ప్రజారోగ్య శాఖ అధికారుల చర్యలు శూన్యం..

ఖాళీ స్థలాల యజమానులను గుర్తించి వారి స్థలాలను శుభ్రం చేయించడం, వాటిల్లో మెరక తోలించుకోవాల్సిందిగా నోటీసులు ఇవ్వాల్సిన సంబంధిత అధికారుల నిర్లక్ష్యం వలనే ఖాళీ స్థలాలు ప్రమాదకరంగా తయారయ్యాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. గతంలో ఖాళీ స్థలాలను గుర్తించి వాటిని శుభ్రం చేసుకుని మెరక తోలించుకోవాలని లేనిపక్షంలో నగరపాలక సంస్థ స్వాధీనం చేసుకుంటుందని హెచ్చరిస్తూ నోటీసు బోర్డులు ఏర్పాటు చేసేవారని, ప్రస్తుతం ఆ పరిస్థితి ఎక్కడా కనిపించడం లేదని చెబుతున్నారు.



సరస్వతి నగర్ ఖాళీ స్థలంలో దర్శనమిస్తున్న పిచ్చి మొక్కలు, చెత్తాచెదారం

ఖాళీ స్థలాలను శుభ్రం చేయించాలి..



ఖాళీ స్థలాల యజమానులకు నోటీసులు ఇవ్వడంతో పాటు చర్యలు తీసుకోవాలి. ఖాళీ స్థలాల్లో పిచ్చి మొక్కలు తొలగించి, మురుగు నీరు నిల్వ లేకుండా చేయాలి. మురుగు నీరు నిల్వ ఉండటంతో దోమలు విజృంభించి చిన్న పిల్లల నుంచి వృద్ధుల వరకు రోగాల బారిన పడుతున్నారు. రాత్రి వేళల్లో విష సర్పాలు, కీటకాలు సంచరిస్తుండటంతో భయభ్రాంతులకు గురవుతున్నాం.

–టి.వెంకటేశ్వర్‌రెడ్డి, ముత్యాలరెడ్డినగర్.

వేతన బకాయిలు ఇప్పించాలని మేయర్‌కు వినతి



నెహ్రూనగర్: వేతన బకాయిలు చెల్లించాలని నగర మేయర్ కావటి మనోహర్‌నాయుడికి నగరపాలక సంస్థలో అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ కార్మికులు విన్నవించారు. ఈ మేరకు మంగళవారం సంపత్‌నగర్‌లోని మేయర్ క్యాంపు కార్యాలయంలో కలసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర మున్సిపల్ ఇంజినీరింగ్, టౌన్ ప్లానింగ్ అండ్ శానిటేషన్ వర్కర్స్ యూనియన్ నాయకులు మాట్లాడుతూ ఆగస్టు, 2020 నుంచి ఏప్రిల్, 2021 వరకు కార్మికునికి రూ.3 వేలు చొప్పున వేతన బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయని వాటిని ఇప్పించేలా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఆప్కాస్ ఏర్పాడే సమయంలో అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ వర్కర్లు ఇవ్వాల్సిన జీతంలో కొంత మేర కోత విధించారని... దానిని ఇప్పించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని వినతిపత్రంలో కోరారు. స్పందించిన మేయర్ ఈ వారంలో స్టాండింగ్ కమిటీ సమావేశంలో బకాయిల విడుదలపై తగిన నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు. మేయర్‌ను కలిసిన వారిలో యూనియన్‌నాయకులు మధుబాబు, య కోబు, పోతురాజు,వెంకటేశ్వరరావు,రామయ్య ఉన్నారు.

సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు

నగరంపాలెం: కార్తిక మాసం ఏకాదశి సందర్భంగా అరండల్‌పేట 11వ వీధిలోని శ్రీరమా సత్యనారాయణస్వామి దేవాలయ ఆవరణలో మంగళవారం సాయంత్రం 150 మంది దంపతులతో సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు నిర్వహించారు. భక్తులకు స్వామివారి అన్న ప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ గుణ్ణం శ్రీనివాసరావు, అర్చకులు కుందేటి గోపాలరావు, కేశవ్ పాల్గొన్నారు.

భారత రాజ్యాంగం ప్రపంచ దేశాలకే దిక్సూచి

వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు వనమా బాలవజ్రబాబు

నెహ్రూనగర్: భారత రాజ్యాంగం ప్రపంచ దేశాలకే దిక్సూచి అని వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు వనమా బాలవజ్రబాబు, పార్టీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త షేక్ నూరి ఫాతిమా పేర్కొన్నారు. భారత రాజ్యాంగం ఆమోద దినోత్సవాన్ని పురస్కరించుకుని లాడ్జి సెంటర్, తూర్పు నియోజకవర్గం 57వ డివిజన్‌లోని గడ్డిపాడు వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి మంగళవారం ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారతదేశంలో ఎన్నో మతాలు, కులాలు, జాతులు కలిసి మనుగడ సాగిస్తున్నాయంటే అది మన రాజ్యాంగం గొప్పతనమేనని అన్నారు. అంతటి మహత్తరమైన రాజ్యాంగాన్ని మనకు అందించిన డాక్టర్ అంబేడ్కర్ ప్రజల గుండెల్లో చిరస్మరణీయుడేనన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు పఠాన్ రీహన, అబిద్, మెహమూద్, పాపతోటి అంబేడ్కర్, రామనబోయిన అజయ్, యాట్ల రవి, దూపాటి వంశీ, ముఖ్య నాయకులు అగ్గిపెట్టి రాజు, తుమ్మేటి శ్రీను, మద్రి సత్యనారాయణ, పోలవరపు వెంకటేశ్వరరావు, బికరీ, ఆవుల కోటేశ్వరరావు, నరకట్ల శ్రీను, రాజేష్ పాల్గొన్నారు.

జేకేసీ కళాశాలలో..

గుంటూరు ఎడ్యుకేషన్: భారతదేశ రాజ్యాంగం ప్రతి పౌరునికి సమానంగా హక్కులు కల్పించిందని ఉమ్మడి ఏపీ హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ కేజీ శంకర్ పేర్కొన్నారు. మంగళవారం జేకేసీ కళాశాల రోడ్డులోని జేసీ లా కళాశాల, దళిత స్త్రీ శక్తి సంయుక్తంగా రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించారు. జస్టిస్ శంకర్ రాజ్యాంగం– సమానత్వం అనే అంశంపై మాట్లాడుతూ రాజ్యాగ నిర్మాతగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ప్రపంచంలో ఏ దేశానికి లేని విధంగా గొప్ప లిఖిత పూర్వక రాజ్యాంగాన్ని రచించారని అన్నారు. జిల్లా విశ్రాంత జడ్జి జేసు రత్నకుమార్ మాట్లాడుతూ రాజ్యాంగం గురించి ప్రతి పౌరుడు తప్పక తెలుసుకోవాలని సూచించారు. ఆర్టికల్–39 ద్వారా ఉచిత న్యాయ సహా యం అందుకునే హక్కుతో పాటు నవంబర్ 26 వరకట్న విమోచన దినమని చెప్పారు. కట్నం ఇవ్వడం, తీసుకోవడం నేరంగా పరిగణించబడుతుందని చెప్పారు. దళిత స్త్రీ శక్తి జాతీయ కన్వీనర్ గెడ్డం ఝాన్సీ మాట్లాడుతూ న్యాయ సహాయం అవసరమైన వారికి దానిని అందుకునే విధానాలను గురించి వివరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ సుధాకర్ బాబు పాల్గొన్నారు.



అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న బాలవజ్రబాబు, నూరిఫాతిమా

దేశాభివృద్ధి సూచిక భారత రాజ్యాంగం

దేశాభివృద్ధికి భారత రాజ్యాంగం సూచిక వంటిదని భారత్ వికాస్ పరిషత్ ప్రాంతీయ కార్యదర్శి బి.మల్లికార్జునరావు పేర్కొన్నారు. మంగళవారం పట్టాభిపురంలోని టీజేపీఎస్ కళాశాలలో రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించారు. కళాశాల కార్యదర్శి కేవీ బ్రహ్మం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో కళాశాల డిగ్రీ ఇన్‌చార్జి భానుమురళి, గుంటూరు జిల్లా ఎన్ఎస్ఎస్ నిర్వహణాధికారి జేవీ సుధీర్‌కుమార్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

- అమరావతిరోడ్డులోని సెయింట్ ఆన్స్ ఇంగ్లిష్ మీడియం స్కూల్లో రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ సిస్టర్ అమలా మేరీ, ప్రిన్సిపాల్ సిస్టర్ జి.విమలమేరీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రాజ్యాంగంపై అవగాహన కలిగి ఉండాలి

నగరంపాలెం: రాజ్యాంగంపై ప్రతి పౌరుడు అవగాహనా కలిగి ఉండాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి టి.లీలావతి అన్నారు. జిల్లా కోర్టు ఆవరణలోని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కా ర్యాలయంలో మంగళవారం రాజ్యాంగ దినోత్సవం, వరకట్న వ్యతిరేక దినోత్సవం సందర్భంగా న్యా య విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ కార్యదర్శి లీలావతి మాట్లాడుతూ రా జ్యాంగం ద్వారా కల్పించిన హక్కులను కాపాడుకుంటూ విధులను సక్రమంగా నిర్వర్తించాలని అన్నారు. వరకట్నాన్ని సమూలంగా నిర్మూలించేందుకు అందరూ కృషి చేయాలని చెప్పారు. వరకట్నం పీడనను సమాజం నుంచి తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. అనంతరం రాజ్యాంగ పీఠికను చదివించారు.

కేఎల్పీ స్కూల్లో..

గుంటూరు ఎడ్యుకేషన్: జేకేసీ కళాశాల రోడ్డులోని డాక్టర్ కేఎల్పీ పబ్లిక్ స్కూల్లో మంగళవారం రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులతో రాజ్యాంగ పీఠిక ప్రతిజ్ఞ చేయించారు. పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్, ప్రిన్సిపాల్ జి.రత్తయ్య పాల్గొన్నారు.

ఎంఈఓ కార్యాలయంలో..

గుంటూరు ఎడ్యుకేషన్: కలెక్టర్ బంగ్లారోడ్డులోని గుంటూరు అర్బన్ ఎంఈఓ కార్యాలయంలో మంగళవారం రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి ఎంఈఓలు ఎస్ఎంఎం అబ్దుల్ ఖుద్దూస్, బీవీ రమణయ్య, కె.జ్యోతికిరణ్, కె.నాగేంద్రమ్మ పూలమాల వేసి నివాళులర్పించారు. అంబేడ్కర్ ప్రసాదించిన వరం రాజ్యాంగమని వారు పేర్కొన్నారు.

రాజ్యాంగాన్ని ప్రతి ఒక్కరూ గౌరవించాలి

లక్ష్మీపురం: రాజ్యాంగాన్ని ప్రతి ఒక్కరూ గౌరవించాలని మాజీ ఎమ్మెల్యే ఏపీసీసీ అధికార ప్రతినిధి షేక్ మస్తాన్‌వలి అన్నారు. స్థానిక మార్కెట్ సెంటర్‌లో జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు చిలాక విజయ్ కుమార్ ఆధ్వర్యంలో రాజ్యాంగ దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. తొలుత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే లింగంశెట్టి ఈశ్వరరావు, ఏపీసీసీ జనరల్ సెక్రెటరీ గడ్డం పాల్ విజయ్ కుమార్, వెస్ట్ ఇన్‌చార్జి రాచకొండ జాన్ బాబు, బిళ్ళా సునిల్, జిల్లా ప్రధాన కార్యదర్శి యన్నం సుధీర్ బాబు, లీగల్ సెల్ జిల్లా అధ్యక్షులు పాకనటి నరేష్, సిటీ కాంగ్రెస్ కమిటీ చుక్క చంద్ర పాల్, షేక్ ఖలీల్ పాల్గొన్నారు.

అవగాహన సంస్థ ఆధ్వర్యంలో..

లక్ష్మీపురం: యావత్ భారత ప్రజల పవిత్ర గ్రంథమైన భారత రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవటమే దేశ ప్రజలందరూ ప్రాథమిక బాధ్యతగా ఉండాలని విశ్లేషకులు ఇంజినీర్ ఎన్.సదాశివం, అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి అన్నారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో మంగళవారం రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు.

పటిష్ట విధానాలతో భారత రాజ్యాంగం

జాయింట్ కలెక్టర్ భార్గవ్ తేజ్

గుంటూరు వెస్ట్: అద్భుతమైన రాజ్యాంగాన్ని మనకందించిన మహనీయులను స్ఫూర్తిగా తీసుకుని రాజ్యాంగాన్ని గౌరవించాలని జాయింట్ కలెక్టర్ భార్గవ్ తేజ్ చెప్పారు. భారత రాజ్యాంగ దినోత్సవం పురస్కరించుకుని మంగళవారం స్థానిక లాడ్జిసెంటర్‌లోని డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ విగ్రహం వద్ద భారత ప్రభుత్వ యువజన వ్యవహారాలు, క్రీడా మంత్రిత్వ శాఖ, నెహ్రూ యువ కేంద్రం, గుంటూరు నగరపాలక సంస్థ సంయుక్తంగా వేడుకలు నిర్వహించారు. ఈసందర్భంగా జేసీ మాట్లాడుతూ సర్వశ్రేష్ఠమైన భారత రాజ్యాంగాన్ని మనందరికి అందించిన ప్రపంచ మేధావి భారత రత్న డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ అని కొనియాడారు. భారత రాజ్యాంగంలో పొందు పరిచిన విలువలను కాపాడడంలో అందరూ తమ బాధ్యతలను గుర్తెరగాలన్నారు. పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవి మాట్లాడుతూ భారతీయ సంస్కృతులను నైతికత, మూల విలువలను దృష్టిలో ఉంచుకుని ప్రతి పౌరుడికి సమాన హక్కులు కల్పించాలనే లక్ష్యంతో రాజ్యాంగ పరిషత్ భారత రాజ్యాంగాన్ని రూపొందించిందన్నారు. అనంతరం ఐదు కిలో మీటర్ల వాక్‌ను ఎమ్మెల్యే మాధవి, అధికారులు జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో జీఎంసీ కమిషనర్ పులి శ్రీనివాసులు, సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ ఏడీ ఆర్.రమేష్‌చంద్ర, డీఆర్‌డీఏపీడీ విజయలక్ష్మి, ఆర్డీఓ కె.శ్రీనివాసరావు, డీఆర్వో షేక్ ఖాజావలి, స్టెప్ సీఈఓ కిరణ్మయి దేవిరెడ్డి పాల్గొన్నారు.



జెండా ఊపి వాక్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గల్లా మాధవి, పక్కన జేసీ భార్గవ్‌తేజ్, కమిషనర్



న్యాయ విజ్ఞన సదస్సులో ప్రతిజ్ఞ చేయిస్తున్న లీలావతి



రాజ్యాంగ పీఠిక ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు



అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎంఈఓలు ఖుద్దూస్, రమణయ్య, జ్యోతికిరణ్



మాట్లాడుతున్న ఉమ్మడి ఏపీ హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి కేజీ శంకర్

రాజ్యాంగ పరిరక్షణ అందరి బాధ్యత

- ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు
- నగరంలో వామపక్షాలు, ప్రజాసంఘాల భారీ ర్యాలీ

లక్ష్మీపురం: నేడు రాజ్యాంగం ప్రమాదంలో పడిందని, దాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి పౌరుడిపై ఉందని ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు అన్నారు. మంగళవారం దేశవ్యాప్త కార్యక్రమాల్లో భాగంగా నగరంలోని బ్రహ్మానందం స్టేడియం నుంచి మార్కెట్ సెంటర్ వరకు ర్యాలీ ఏర్పాటు చేశారు. రైతు సంఘం జిల్లా కార్యదర్శి కంచుమాటి అజయ్, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు అరుణ్ కుమార్, సీఐటీయూ జిల్లా అధ్యక్షులు దండా లక్ష్మీనారాయణ, ఏపీ రైతు సంఘం నాయకులు పచ్చల శివాజీల సంయుక్త ఆధ్వర్యంలో ఈ ర్యాలీతోపాటు నిరసన కార్యక్రమం జరిగింది. రైతులు, కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరికి న్యాయం జరిగేలా రాజ్యాంగం ఉందన్నారు. దీనికి తూట్లు పొడిచేలా పాలకులు వ్యవహరిస్తున్నారని చెప్పారు. రాజ్యాంగాన్ని అందరూ కలిసి కాపాడుకోవాలని కోరారు. ఏపీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ మద్దతు ధరల చట్టం తీసుకొస్తేనే రైతులకు మేలు జరుగుతుందన్నారు. ఏఐటీయూసీ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు వెలుగూరి రాధాకృష్ణ మూర్తి మాట్లాడుతూ.. నాలుగు లేబర్ కోడ్‌లు రద్దు చేయకపోతే కార్మికులు రోడ్డుపడతారన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్ కుమార్ , సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కె.నళినీకాంత్, జాతీయ రైతు కూలీ సంఘం నాయకులు ఉల్లిగడ్డ నాగేశ్వరరావు, ఏరువాక రైతు కూలీ సంఘం నాయకులు పాడిపండ్ల కోటేశ్వరరావు, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి హనుమంతరావు, సీఐటీయూ జిల్లా కార్యదర్శి వై .నేతాజీ, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు జొన్న శివశంకర్ , కొల్లి రంగారెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఈమని అప్పారావు, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి బైరగాని శ్రీనివాసరావు, సీఐటీయూ నాయకులు కె.శ్రీనివాసరావు, ఏఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి కోటయ్య, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు మాల్యాద్రి, ఆవాజ్ రాష్ట్ర నాయకులు మహమ్మద్ షఫీ, కౌలు రైతు సంఘం నాయకులు జగన్నాథం పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

పీకలవాగు ముంపు నివారణకు చర్యలు

కమిషనర్ పులి శ్రీనివాసులు

నెహ్రూనగర్: నగరం నుంచి మురుగు సముద్రంలోకి వెళ్లే పీకల వాగు మెయిన్ డ్రెయిన్ వేజెండ్ల, సుద్దపల్లి పంట పొలాల్లోకి పొంగకుండా శాశ్వత ప్రాతిపదికన చర్యలు తీసుకుంటామని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం కమిషనర్ వేజెండ్ల, సుద్దపల్లి గ్రామాల పరిధిలో పీకల వాగు, సంగంజాగర్లమూడి నుంచి గుంటూరు నగరానికి తాగునీటి సరఫరా జరిగే పైప్ లైన్‌ని పరిశీలించారు. తొలుత వేజెండ్ల, సుద్దపల్లి గ్రామాల రైతులతో వారు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పర్యటనలో ఏసీపీ చంద్రశేఖర్, టీపీఎస్ లక్ష్మణస్వామి, సర్వేయర్ సుభాని, ట్యాక్స్ పేయర్స్ అసోసియేషన్ అధ్యక్షులు నారాయణరెడ్డి, అంజిరెడ్డి పాల్గొన్నారు. గుంటూరు నగరంలోని సంజీవయ్య నగర్ రైల్వే గేటు నుంచి నెహ్రూనగర్ రైల్వే గేటు వరకు రోడ్, డ్రెయిన్ ఆక్రమణలను డిసెంబర్ 2 నుంచి తొలగింపు చేపడతామని చెప్పారు. కమిషనర్ చాంబర్‌లో 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి గ్యారంటీ బోర్డుల బకాయి రూ.45 లక్షల చెక్‌ను చైతన్య మీడియా సొల్యూషన్స్ మేనేజర్ సయ్యద్ బాబు కమిషనర్ అందజేశారు.

ఏఎస్ఐలకు కొనసాగిన అవుట్‌డోర్ పరీక్షలు



నగరంపాలెం: గుంటూరు రేంజ్ పరిధిలోని 58 మంది ఏఎస్ఐలకు ఎస్ఐ ఉద్యోగోన్నతుల కోసం నిర్వహిస్తున్న పరీక్షలు మంగళవారం రెండో రోజుకి చేరాయి. గుంటూరు పోలీస్ పరేడ్‌గ్రౌండ్‌లో నిర్వహిస్తున్న అవుట్‌డోర్ పరీక్షలను గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి, గుంటూరు జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ పర్యవేక్షించారు. ఏఎస్ఐలకు నీట్ టర్న్అవుట్, ఫుట్ డ్రిల్, వెపన్ డ్రిల్, వెపన్ ప్రూవింగ్, మార్చ్ ఫాస్ట్, నేర స్థలంలో సాక్ష్యాధారాల సేకరణ తదితర అంశాలపై పరీక్షలు జరిగాయి. ఏఎస్ఐల నుంచి ఐజీ పలు ప్రశ్నలకు సమాధానాలను అడిగి తెలుసుకున్నారు.

బెదిరింపులకు దిగిన వ్యక్తులపై కేసు

లక్ష్మీపురం: రియల్‌ఎస్టేట్ వ్యాపారులు బెదిరింపులపై ఓ వ్యక్తి పోలీసులకు సోమవారం రాత్రి ఫిర్యాదు చేశాడు. అరండల్‌పేట పోలీసులు తెలిపిన వివరాలు.. ఆర్టీసీ కాలనీకి చెందిన ఉన్నం సాంబశివరావు, రియల్‌ఎస్టేట్ వ్యాపారం చేసే రామాంజనేయులుతో ఈనెల 10వ తేదీన విద్యానగర్‌లో 555 చ.గజాల స్థలం కొనుగోలుకు ఒప్పందం చేసుకున్నారు. ఒప్పందంలో సుమారు రూ.55 లక్షలు అంచనా వేసి అడ్వాన్స్‌గా రూ.1.95 లక్షలు చెల్లించాడు. సాంబశివరావు స్థలం వద్దకు వెళ్లి చూడగా స్థలం నచ్చదు. దీంతో వ్యాపారిని అడ్వాన్స్ వాపస్ చేయాల్సిందిగా కోరడంతో రామాంజనేయులు అతడితో పాటు శ్రీను, శ్రీనివాస్ కలిసి బాధితుడిని బెదిరించారు. నగదు తిరిగి ఇచ్చే పనిలేదని చెప్పడంతో బాధితుడు అరండల్‌పేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.